అభివృద్ధి చేస్తా ఆదరించండి..

• బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి


ప్రచారంలో పాల్గొన్న పాడి కౌశిక్‌రెడ్డి


కమలాపూర్‌లో ఇంటింటి ప్రచారం

ఇల్లందకుంట: రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాచపల్లి, మల్లన్నపల్లి గ్రామాల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 17వేల కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. రాచపల్లిలో మిగిలిన రోడ్లతో పాటు కుల భవనాలు, ఆలయాలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

రాచపల్లిలోని బీజేపీ నాయకులు సోమవారం కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బీర్ఎస్‌లో చేరారు.

కుటుంబ సభ్యుల్లానే భావిస్తారు..

నియోజకవర్గంలోని అందరినీ తన కుటుంబ సభ్యుల్లానే బీర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి భావిస్తారని ఆయన సతీమణి శాలినిరెడ్డి అన్నారు. కౌశిక్‌రెడ్డికి ఒక్క అవకాశం కల్పించాలని కోరారు.

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని సిర్సపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. హుజూరాబాద్ సింగిల్‌విండో చైర్మన్ కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామారావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

జమ్మికుంట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. శంభునిపల్లి, తనుగుల, గండ్రపల్లి,విలాసాగర్ గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని 16,22,29 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌశిక్ రెడ్డి సతీమణి శాలినిరెడ్డి, పాల్గొన్నారు.

హుజూరాబాద్: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వెయ్యికోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. 3,4,518,19 వార్డుల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో మాట్లాడారు. పట్టణంలో స్పోర్ట్స్ స్టేడియంతో పాటు మినీ కలెక్టరేట్ నిర్మిస్తానన్నారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ బండ శ్రీనివాస్, మున్సిపల్‌చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, అపరాజ ముత్యంరాజు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

కమలాపూర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు మండల కేంద్రంతో పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మెండు రాధిక రమేశ్ కారు గుర్తుకు ఓటేయాలని ఓట్లు అభ్యర్థించారు. వార్డు సభ్యులు కాల్వ కట్టయ్య, వెంగళ విజయ్, మౌటం సాంబమూర్తి, బీఆర్ఎస్ నాయకులు మురళి, బాలసాని కుమారస్వామి, అనిల్, రవి, శ్రీనివాస్, రాజయ్య, మహేశ్, రవి, అరుణ్ పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన నేతలు


సీఎంకు జ్ఞాపిక అందిస్తున్న ఎంపీపీ, తదితరులు

తిమ్మాపూర్: ప్రజాఆశీర్వాద సభలో పాల్గొనేందుకు తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌కు వచ్చిన సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర సాంస్కతికి సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, ఎంపీపీ వనితారెడ్డి హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎల్‌పీ సెక్రెటరీ మాదాడి రమేశ్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ, జెడ్పీటీసీ శైలజ జితేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ప్రసాదం అందజేత..

హెలిక్యాప్టర్ నుంచి శ్రీచైతన్య కళాశాలలోని ప్రజా ఆశీర్వాద సభా వేదికకు వచ్చిన సీఎంకు ఎంపీపీ కేతిరెడ్డి వనితారెడ్డి బొట్టు పెట్టి వేంకటేశ్వరస్వామివారి ప్రసాదం అందించారు. పలువురు మహిళా నేతలు సీఎంను కలిశారు.

నేడు సర్వసభ్య సమావేశం

హుజూరాబాద్‌రూరల్ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్ననట్లు ఎంపీడీవో జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

హుస్నాబాద్‌లో దళారులదే రాజ్యం

• కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్


మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న పొన్నం ప్రభాకర్

కోహెదరూరల్(హుస్నాబాద్): హుస్నాబాద్‌లో దళారులదే రాజ్యం అని.. సామాన్యుడు ఎమ్మెల్యేను కలిసే పరిస్థితి లేదని కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని సముద్రాల, బత్తులవానిపల్లి, నాగసముద్రాల, లక్ష్మాపూర్, పోరెడ్డిపల్లి, బస్వాపూర్, జ్యోతిరాంతండా, గద్దపల్లి, ముత్తన్నపేట, ఆరెపల్లి, చంద్రనాయక్‌తండా, ధర్మాసాగర్‌పల్లి, వెంకటేశ్వరపల్లి, సోమా రంపల్లి, తీగలకుంటపల్లి, వెల్దండపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు స్థానిక ఎమ్మెల్యే సన్నిహితుడు అయి ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. గౌరవెల్లి పూర్తి కాకుండా కాంగ్రెస్ అడ్డుపడిందని అనడం సరికాదన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు 70 శాతం కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

పొన్నం ప్రభాకర్ సమక్షంలో పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సామాజిక సేవకురాలు మంజులారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్, మండల పార్టీ అధ్యక్షుడు మంద ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఇంటికి పంపించాలి

కోహెద(హుస్నాబాద్): హామీల అమలులో విఫలమైన బీఆర్ఎస్‌ను ఇంటికి పంపించాలని పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. కోహెడలో డిగ్రీ, ఐటీఐ కళాశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, మంద పవన్, సుధాకర్, జగన్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పొన్నం సతీమణి ఇంటింటి ప్రచారం

చిగురుమామిడి: మండలంలోని చిన్న ముల్కనూర్‌లో సోమవారం ఉదయం, చిగురుమామిడి మండల కేంద్రంలో సాయంత్రం హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సతీమణి పొన్నం మంజుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చిగురుమామిడి జెడ్పీటీసీ రవీందర్, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కుల రాజకీయాలు మానుకోండి

సైదాపూర్: నియోజకవర్గంలో పొన్నం ప్రభాకర్‌కు బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు కుల రాజకీయాలు చేస్తున్నారని సైదాపూర్ గౌడ కుల సంఘం నాయకులు మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో గౌడ కుల సంఘం నాయకులు వెన్కెపల్లి సింగిల్ విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు, గున్నాల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా


నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సతీశ్‌కుమార్


సైదాపూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

• హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్
• నియోజకవర్గంలో సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చేశాం

సైదాపూర్: రెండుసార్లు గెలిపించారు.. అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేశా. మూడోసారి ఆశీర్వదించండి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఎలబోతారం, చింతలపల్లి, రాంచంద్రాపూర్, జాగీర్‌పల్లి, సైదాపూర్, వెన్కెపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుడి వరకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చేశానని అన్నారు. తనపై పోటీ చేస్తున్న వ్యక్తి కరీంనగర్‌లో ఎస్సీ, బీసీలను నిలువునా ముంచాడని ఆరోపించారు. కార్యకర్తలను మానేరులో ముంచి హుస్నాబాద్‌కు వచ్చాడన్నారు. అలాంటి వ్యక్తిని నమ్ముకుంటే హుస్నాబాద్ ప్రజలను కూడా ముంచుతాడని పేర్కొన్నారు. సతీశ్‌కుమార్‌ను గెలిపిస్తే అవినీతి రహితంగా మిగితా పనులు పూర్తి చేసి, నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతాడని మాజీ మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, సింగిల్ విండో అధ్యక్షులు తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, సర్పంచ్‌లు శిరీష, సుమలత, కాంతమ్మ, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి బీజేపీ నేతలు..

హుస్నాబాద్‌రూరల్: అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి విజయపాల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి సతీష్, శ్రావణ్ బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని తెలిపారు. రేపు మంత్రి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, వంగ వెంకట్రామిరెడ్డి, నాయకులు బీలు నాయక్, పెసరు సాంబరాజు, అన్వర్‌పాషా, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలతో పచ్చగా పొలాలు

చిగురుమామిడి: కాళేశ్వరం జలాలతో గ్రామాల్లో పంట పొలాలన్నీ పచ్చగా ఉన్నాయని, చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉన్నాయని చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. సోమవారం చిగురుమామిడిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్‌కు మద్దతు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చిగురుమామిడి మండలపరిషత్ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మండల సమన్వయ సమితి అధ్యక్షుడు తిరుపతి, సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, నాయకులు శివప్రసాద్, శ్రీకాంత్, సదానందం, ఐరెడ్డి రాజిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతాం

• కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ


పచ్చునూర్‌లో మాట్లాడుతున్న కవ్వంపల్లి


ఒబులాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ

మానకొండూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతామని కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మద్దికుంట, పచ్చునూర్, ఊటూర్ గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లో సంతృప్తికరంగా లేవన్నారు. ఇటీవల పచ్చునూర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దసాని సులోచన మాట్లాడుతూ తాను డబ్బులు తీసుకుని కాంగ్రెస్ పార్టీలో చేరలేదన్నారు. కాంగ్రెస్ పైన లేనిపోని ఆరోపణలు చేయద్దన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల వాగ్దానాలను నమ్మవద్దన్నారు. ఎమ్మెల్యే బసవన్న గౌడ మాట్లాడుతూ కర్ణాటకలో మాదిరిగానే ఇక్కడ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తామన్నారు. ఎంపీపి ముద్దసాని సులోచన, రాయచూర్ ఎమ్మెల్యే బస్వన్న గౌడ, కవ్వంపల్లి అనురాధ, ఊటూర్ ఎంపీటీసీ గోపు మమత, శ్రీనివాస్‌రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, వెలిశెట్టి కిషోర్, బొంగోని అనిల్, రంగస్వామి, మల్లేశ్ రాజేందర్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజేందర్, వైసెంపీపి గోపు మధుసూదన్ రెడ్డి, కనకం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం : కేశవపట్నం మండల కేంద్రంలోని వారసంతలో సోమవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో మానకొండూర్ నియోజకవర్గ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటా వివరించారు..

ఇల్లంతకుంటలో..

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ వూట్కూరి వెంకట రమణా రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ఆరు గ్యారంటీలపై ప్రచారం నిర్వహించారు. చేయి గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మరు

• కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రణవ్


మాట్లాడుతున్న వొడితల ప్రణవ్

వీణవంక: బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలు ప్రజలు నమ్మరని, పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి రాగానే హామీలు అమలు చేస్తామన్నారు. మార్కెట్ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో దేశాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరారు. నల్ల కొండల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మంద రాజిరెడ్డి, పురంశెట్టి శంకరయ్య, బుడిగ జంగం మండల అధ్యక్షుడు తూర్పాటి కనుకయ్య, కొయ్యడ రాములు, కనుకం రామయ్య, గొస్కుల అరవింద్, అరెపల్లి సదయ్యతోపాటు 150 మందిని కాంగ్రెస్‌లో చేరారు.

బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటే..

హుజూరాబాద్‌రూరల్ : బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండు ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. కొత్తపల్లి–ఇందిరానగర్, బోర్నపల్లి, తుమ్మనపల్లి, మందాడిపల్లి, సింగాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ మంద మంజుల సమ్మిరెడ్డి, ఎంపీటీసీ సరిత జైపాల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుగుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిరణ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేణు కుమార్, తదితరులున్నారు.

సభను విజయవంతం చేయాలి

హుజూరాబాద్ : ఈనెల 23న జమ్మికుంటలో నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభను ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పీసీసీ మెంబర్ కృష్ణారెడ్డి కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

• ఏసీపీ జీవన్‌రెడ్డి

జమ్మికుంట: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి మోత్కులగూడెం, మండలంలోని మడిపల్లి, కోరపల్లి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిఘా ఏర్పాట్లు చేస్తున్నామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఆయాపార్టీల నాయకులు, ఎన్నికల కోడ్ నియమావళి పాటించాలన్నారు. ఇప్పటికే మండల, పట్టణ పరిధిలో పలువురిని బైండోవర్ చేశామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపిక పోటీలు

మానకొండూర్ : మండలంలోని అన్నారం జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో క్రీడాసమాఖ్య –17 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 250 మంది పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మార్చాలి

చొప్పదండి: పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయం సమీపంలో ఉన్న మద్యం దుకా ణాన్ని మార్చాలని స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇళ్లకు మద్యం దుకాణం దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



శంకరపట్నం: ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని సీఐ సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని మొలంగూర్, ఆముదాలపల్లి, తాడికల్ గ్రామాలలో ఎన్నికల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఓటర్లకు మద్యం, డబ్బులు పంపిణీ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదాలు జరిగితే తప్ప పట్టించుకోరా ?


రోడ్డు మధ్య గుంతలో చెట్టు


రోడ్డు పక్కన పైకప్పు లేని గేట్‌వాల్వ్

• రోడ్డు మధ్యలోనే గుంతలు, పైకప్పులేని గేట్‌వాల్వ్‌లు
• పొంచి ఉన్న ప్రమాదం ఇబ్బందుల్లో వాహనదారులు
• సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి


ప్రమాదకరంగా కల్వర్టు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో రోడ్డుపై తవ్విన గుంతలు, కల్వర్టు, మిషన్ భగీరథ గేటువాల్వ్‌లు, పట్టణ రహదారులు ప్రమాదకరంగా మారాయి. పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్లుగా రోడ్డు మధ్య, పక్కన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదాలు జరిగితే గాని పట్టించుకోరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదాలు జరగకుండా మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి

మున్సిపల్ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెబుతున్న పాలకులు, అధికారులకు పట్టణంలో సమస్యలు కనిపించడం లేదా అని ప్రజలు వాపోతున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు ఇవే..

పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, నాయిని చెరువు, మార్కెట్ రోడ్డు కూడలి వద్ద మూడేళ్ల క్రితం వరద నీరు వెళ్లేందుకు సీసీరోడ్డు పగులగొట్టి గుంతను తవ్వారు. ఇప్పటివరకు రోడ్డుమధ్యలో గుంతను పూడ్చకపోవడంతో చెట్లు మొలుస్తున్నాయి. బారికేడ్లు పెట్టి మమా అనిపిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుసార్లు విన్నవించినా సమస్య పరిష్కరించడం లేదని వార్డుప్రజలు వాపోతున్నారు.

• మున్సిపల్, తహసీల్దార్, మార్కెట్‌కు వెళ్లే రహదారిలో మూడేళ్లక్రితం వరద నీరు వెళ్లేందుకు తాత్కాలికంగా రోడ్డుకు గండి కొట్టి మోరివేసి మట్టి పోశారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. మోరి వద్ద రక్షణ గోడను నిర్మించాల్సిన అవసరం ఉంది.

• మున్సిపల్ పరిధి కొత్తపల్లి బ్రిడ్జి చివరి నుంచి మడిపల్లి వెళ్లే దారిలో మిషన్ భగీరథ గేటు వాల్వ్ ఏర్పాటు చేసి పైకప్పు వేయకుండా వదిలివేశారు. రోడ్డు చిన్నగా ఉండడంతో భారీ వాహనాలు, ద్విచక్రవాహనదారులు జంకుతున్నారు.

• కొత్తపల్లి పరిధిలోని వావిలాల రోడ్డులో కెనాల్ పక్కనుంచి కాలనీ వద్ద మూలమలుపు ప్రమాదకరంగా మారింది. గతంలో రాత్రివేళ ఓ ఆటో బోల్తా పడింది. రక్షణ గోడ నిర్మించి, చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

• పట్టణంలోని పలు వార్డుల్లో గుంతలు, రక్షణలేని మోరీలు, కల్వర్లులు, గుంతలు ప్రమాదకరంగా మారాయి.

సమస్యలు పరిష్కరించడం లేదు



మూడేళ్ల క్రితం వరద నీరు వెళ్లేందుకు సీసీరోడ్డు తవ్వారు. ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతు చేపట్టకుండా వదిలేశారు. రోడ్డు మధ్యలో ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గుంతలో చెట్లు పెరుగుతున్నాయి. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– పూదరి శివకుమార్‌గౌడ్, జమ్మికుంట